నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
హైదరాబాద్, గురువారం 30 జనవరి 2025 | HYDERABAD

## ఎల్లుండి నీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): నాసర్లపల్లి సబ్‌స్టేషన్లోని 132 కేవీ బల్క్ లోడ్ ఫీడర్ పీటీ మరమ్మతులు చేపట్టాల్సిన ఉన్నందున ఫిబ్రవరి 1న శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాన్స్‌కో అధికారులు పనులు చేపట్టనున్నారు. దీంతో కృష్ణా ఫేస్ 1, 2, 3 నుంచి సరఫరా అయ్యే పలు రిజర్వాయర్ల పరిధిలోని ఆరు గంటల పాటు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. మిరాలం, కిషన్ బాగ్, అల్జుబైల్ కాలనీ, శాస్త్రిపురం, సంతోష్ నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్‌గూడ, అస్మాన్‌గడ్, యాకత్‌పురా, మాదన్నపేట, మహబూబ్ మాన్షన్, భోజగుట్ట, షేక్‌పేట, బొగ్గులకుంట, అఫ్జల్‌గంజ్, ఆళ్లబండ, నారాయణగూడ, అడిక్‌మెట్, శివం రోడ్, చిలకలగూడ, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ప్రశాసన్ నగర్, తట్టి ఖానా, తార్నాక, లాలాపేట, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్ రూం, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, రియాసత్‌నగర్, ఆలియాబాద్, మైసారం, అయ్యప్ప సొసైటీ, కావురి హిల్స్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమా నగర్, చెంగిచర్ల, భరత్‌నగర్, ఆనంద్‌నగర్ క్రాస్‌రోడ్స్, పీర్జాదిగూడ, మీర్‌పేట, కుర్మగూడ, లెనిన్‌నగర్, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## ఫీజు బకాయి చెల్లించలేదని.. విద్యార్థి నిర్బంధం

### మేడ్చల్ లో క్రిక్ పాఠశాల యాజమాన్యం నిర్వాకం

మేడ్చల్: ఫీజు బకాయి చెల్లించడంలేదని ఓ విద్యార్థిని పాఠశాలలో నిర్బంధించిన ఘటన మేడ్చల్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ పట్టణంలోని క్రిక్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఫీజు బకాయి రూ.లక్ష చెల్లించాల్సి ఉన్నది. ఇటీవల అతడి తండ్రి రూ.70వేలు కట్టాడు. ఇంకా రూ.30వేలు చెల్లించాల్సి ఉంది. మంగళవారం పాఠశాలకు వచ్చిన సదరు విద్యార్థిని ఫీజు బకాయి ఉన్నదని స్కూల్ యాజమాన్యం ఇంటికి పంపించలేదు. సాయంత్రం 6 గంటలైనా విద్యార్థి రాకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి.. పాఠశాలకు ఫోన్ చేస్తే ఫీజు చెల్లించని కారణంగా స్కూల్‌లోనే ఉంచినట్టు సమాధానం ఇచ్చారు. ఉదయం 9 గంటల వరకు ఫీజు చెల్లిస్తానని, లేకుంటే పాఠశాలకు అనుమతించవద్దని కోరాడు. ఇందుకు యాజమాన్యం ఒప్పుకోలేదు. గంట లోపు ఫీజు చెల్లించి, విద్యార్థిని తీసుకెళ్లాలని హుకూం జారీ చేసింది. కోపోద్రిక్తుడైన విద్యార్థి తండ్రి పాఠశాలకు వద్దకు వచ్చాడు. ఆ లోగా పాఠశాల సిబ్బందితో బైక్‌పై పంపించేందుకు యాజమాన్యం సన్నద్ధమైంది. విద్యార్థి తండ్రి మాట్లాడుతూ పాఠశాలలో ఫీజుల కోసం విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించాడు. విద్యా సంవత్సరం ముగిసేందుకు మూడు నెలల ముందుగా ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారన్నారు. తన కుమారుడు కడుపు నొప్పివస్తున్నదని, ఇంటికి పంపించాలని ఏడ్చినా.. పట్టించుకోలేదని వాపోయాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నేత సంతోష్ రాథోడ్ విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మీటర్లు కాలిపోతున్నాయ్..!

**నెలకు సగటున 20వేల కరెంటు మీటర్ల రిపేర్లు..**

**దక్షిణ డిస్కం పరిధిలో తలెత్తుతున్న లోపాలు**

**క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువు**

**డిస్కంతో పాటు వినియోగదారులపై పెరుగుతున్న భారం**

**లోపాలు తలెత్తకుండా చూసుకుంటాం : సీఎండీ**

**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని గ్రేటర్‌లో విద్యుత్ మీటర్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతున్నది. గత సంవత్సరం మీటర్లలో సాంకేతిక లోపాలు, అధిక లోడ్ కారణంగా 1.63 లక్షల వరకు మీటర్లు స్టకప్‌అవ్వడం లేదా కాలిపోవడం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. తరచూ మీటర్లలో సాంకేతిక సమస్యలు రావడం, సిబ్బంది కూడా మినీమం బిల్లు అంటూ అధిక బిల్లులు వసూలు చేయడంతో వినియోగదారులపై ఆర్థిక భారం పడుతున్నది. - సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ)**

### 60 లక్షలకు పైగా కనెక్షన్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పది సర్కిళ్లు ఉన్నాయి. ఇందులో 60లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 53 లక్షల వరకు గృహ వినియోగదారులు, 6 లక్షల వరకు కమర్షియల్ సర్వీసులు, 50వేలకు పైగా పరిశ్రమలకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గత సంవత్సరం సగటున నెలకు 20వేల కరెంటు మీటర్లు రిపేర్‌కు రావడం, కాలిపోవడం జరిగినట్లు ఇటీవల ఒక నివేదికలో విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. ఇందులో ఎక్కువగా ఏప్రిల్, మే, జూలైల్లో స్టకప్ అవ్వడంతో పాటు కాలిపోయాయని, వీటికి అధిక లోడ్ కారణంగా నివేదికలో పేర్కొన్నారు. మీటర్లు రిపేర్లకు రావడంతో వాటిని రిప్లేస్ చేయకపోగా, మినీమం బిల్లు వేయడంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతున్నది.

### ఒక్క గ్రేటర్‌లోనే..


ఒక్క గ్రేటర్‌లోనే 1లక్ష, 11వేల మీటర్లు రిపేర్లకు రావడం లేదా కాలిపోవడం జరిగిందని అధికారులు చెబుతుండగా.. 1.63 లక్షల మీటర్లు రిపేర్‌కు వచ్చినట్లు విద్యుత్ అధికారుల అంతర్గత నివేదిక చెబుతున్నదని సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఐటీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్న సైబరసిటీ, బంజారాహిల్స్ సర్కిళ్లలో 8వేల మీటర్లు కాలిపోగా, 25వేల మీటర్లు రిపేర్లకు వచ్చాయి. అయితే మీటర్లలో సాంకేతిక లోపాలు తలెత్తడానికి కారణాలేవైనా ఒకవేళ టెక్నికల్ ప్రాబ్లమ్ వస్తే డిస్కం రిప్లేస్ చేయాలి. మీటర్ కాలిపోతే మాత్రం వినియోగదారుడు రూ.2వేలు చెల్లించాలి. ఒక వైపు నెలకు 20వేల మీటర్లు రిపేర్లకు వస్తే.. అందులో రెండు నుంచి మూడు వేల మీటర్లు కాలిపోతున్నాయి. దీనివల్ల ఒకవైపు డిస్కంతో పాటు మరోవైపు వినియోగదారులపై కూడా ఆర్థిక భారం పడుతున్నది. మీటర్లలో నాణ్యత లోపించడం కారణంగానే ఎక్కువగా ఇలాంటి సమస్యలు వస్తున్నాయని విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు.

### అధికలోడే ప్రధాన కారణం..

మీటర్లలో సాంకేతికలోపాలు రావడానికి, కాలిపోవడానికి అధిక లోడే ప్రధాన కారణంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన సిబ్బంది చెబుతున్నారు. తక్కువ లోడ్ సామర్థ్యంతో మీటర్ తీసుకుని ఎక్కువ విద్యుత్ వినియోగించడం వల్ల ఈ సమస్య తలెత్తుతున్నది. అంతేకాకుండా లూజ్ కాంటాక్ట్, షార్ట్ సర్క్యూట్, వర్షానికి తడిసిపోవడం వంటి కారణాలను కూడా డిస్కం చూపుతున్నది. కానీ మీటర్లలో నాణ్యత లేకపోవడం కారణంగా ఈ సమస్యలు వస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో ఆయా ప్రాంతాల్లో లోడ్‌ను పరిశీలించి, ఆ తరవాత మీటర్ రీడింగ్ ఆధారంగా ఎంతమేరకు లోడ్ పడుతుందో పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య తీవ్రమైంది. అంతేకాకుండా నాణ్యతలేని సర్వీస్ వైర్లు మార్చకుండా వాడటంతో పాటు సామగ్రి కూడా చవకబారుదే వాడటం వల్ల కూడా ఇలాంటి సమస్యలు వస్తున్నాయని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు.

### 22న ఒక్కరోజే..

ఇటీవల ఇండ్లలో, వాణిజ్య సంస్థల్లో విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరిగిందని, దీంతో లోడ్ ఎక్కువవుతున్నదని తెలుస్తున్నది. ఈనెల 22న ఒక్కరోజే గ్రేటర్‌లో 4800 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఇంత పెద్ద మొత్తంలో డిమాండ్ నమోదవ్వడంతో అధికారులు రాబోయే వేసవిపై మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో తాము రీడింగ్ తీసే సమయంలో కానీ, మీటర్లు కాలినప్పుడు వెళ్లినప్పుడు కానీ వినియోగదారుల నుంచి వచ్చే స్పందన వ్యతిరేకంగా ఉంటుందని, తాము ప్రశ్నిస్తే తమపై గొడవలకు దిగుతున్నారని, మీటర్లు కాలిపోయిన తర్వాత రిప్లేస్ కోసం తిరిగినప్పుడు కూడా లోడ్ విషయంలో చెబితే వినిపించుకోవడం లేదని వారు చెబుతున్నారు. వినియోగానికి తగినట్లు లోడ్ సామర్థ్యం ఉన్న మీటర్లు తీసుకుంటే అటు డిస్కంకు ఇటు వినియోగదారులకు ఉపయోగమని వారు పేర్కొన్నారు.




### మీటర్లలో సాంకేతిక లోపాలు తగ్గాయి :సీఎండీ ముషారఫ్ ఫరూఖి

గతంతో పోలిస్తే విద్యుత్ మీటర్లలో తలెత్తే సాంకేతిక లోపాలు తగ్గుముఖం పట్టాయని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 15 జిల్లాల్లో 93,46,952 బిల్ట్ సర్వీసులు ఉన్నాయని, గత సంవత్సరం కాలిపోయిన మీటర్ల సంఖ్య 1.21 శాతానికి తగ్గాయని, వచ్చే ఈ ఆర్థిక సంవత్సరంలో లోపాలను పూర్తిగా అధిగమించి మరింత మెరుగైన సరఫరా అందజేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సైతం తమ గృహాల్లో, వాణిజ్యసముదాయాల్లో కనెక్టెడ్ లోడ్‌కు తగ్గట్టు ఇంటర్నల్ వైరింగ్, ఎర్తింగ్, జాయింట్లు లేని వైర్లు, ఎంసీబీలు ఏర్పాటు వంటి భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## గోల్నాకలో అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అంబర్‌పేట: గోల్నాక మెయిన్‌రోడ్డులో ఓ అక్రమ నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. జీవన్ అనే వ్యక్తి కేవలం రెండు అంతస్తులకు అనుమతి తీసుకొని.. ఏకంగా నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు స్లాబు వేశాడు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, చైన్‌మెన్లు తమ సిబ్బందితో కలిసి అనుమతి లేకుండా నిర్మించిన రెండు స్లాబులను కూల్చివేశారు. ఏసీపీ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగిస్తామని, తమ దృష్టికి వచ్చిన అనుమతి లేని నిర్మాణాల కూల్చివేతలకు రంగం సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదమే

సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం సిద్ధమైంది. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, బాధ్యులపై కఠినంగా వ్యవహరించాలని ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. అధికారుల్లో జవాబుదారితనంతో పాటు పట్టణ ప్రణాళిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో సివిల్ పిటిషన్ 295, అప్పీల్ నం 14605 ప్రకారం తీర్పు ప్రకారం న్యాయస్థానం విధి విధానాలను పక్కాగా అమలు చేయాలని కమిషనర్ ఇలంబర్తి నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టు తీర్పు ఆదేశానుసారం అక్రమ నిర్మాణ నియంత్రణలో ప్రత్యేక గైడ్ లైన్స్ విడుదల చేసి పక్కాగా అమలు చేయాలని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు ఉత్తర్వుల ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

## పేద ప్రజల ప్రాణాలకు విలువలేదా?

### అజయ్ కుటుంబసభ్యులకు పరిహారం చెల్లించాలి

**బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్**

బన్సీలాల్‌పేట్: హుస్సేన్‌సాగర్‌లో పటాకుల పేలుడు ఘటనలో మృతి చెందిన చిలువేరు అజయ్ కుటుంబసభ్యులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వారి బంధువులు డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ దవాఖానలో అజయ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అజయ్ బంధువులు, మద్దతుదారులు మార్చురీ వద్ద గుమిగూడారు. కిషన్‌రెడ్డి డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌లో జరిగిన భారతమాత ఫౌండేషన్ మహాహారతి కార్యక్రమం సందర్భంగా ఇద్దరు పౌరులు మృతి చెందినా.. ఇప్పటి వరకు ఒక్క రాష్ట్ర మంత్రిగాని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గాని రాలేదని, పేద ప్రజల ప్రాణాలకు విలువ లేదా అని ప్రశ్నించారు. అజయ్ తండ్రి జానకి రామ్ ఆటో నడుపుతూ.. కుమారుడిని బీటెక్ చదివిస్తున్నాడని, చెట్టంత కొడుకు మరణించగా, వారి కడుపుకోతను ఎవరు తీరుస్తారని అన్నారు. బీజేపీ అనుబంధ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఇంత ఘోరం జరిగినా..ఒక్కరూ స్పందించకపోవడం, నైతిక బాధ్యత వహించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు, పది కోట్ల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం లభించేంత వరకు వారి కుటుంబానికి తాము అండగా నిలబడతామన్నారు.

## నేడు మాంసం దుకాణాలు బంద్..

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ ): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నేడు (గురువారం) జీహెచ్‌ఎంసీ పరిధిలో మాంసం దుకాణాలను మూసి వేయాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాదారులపై చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. నిర్వాహకులు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు.



గోషామహల్ ప్రధాన రహదారిలో నాలా కుప్ప కూలింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులతో కలిసి మంగళ వారం రాత్రి కూలిన నాలాను పరిశీలించారు. వెంటనే నాలాకు మరమ్మతు పనులు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా స్థానికులు నినాదాలు చేశారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ.. తమ నిరసనను తెలిపారు. - అబిడ్స్, జనవరి 29

# 30 రోజులు.. 5 కాలేయ మార్పిడులు

**మరో రికార్డు సృష్టించిన ఉస్మానియా వైద్యులు**

**పైసా ఖర్చు లేకుండా రూ.1.5కోట్ల విలువైన చికిత్స**

సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్: ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా దవాఖాన మరో రికార్డు సృష్టించింది. ఉస్మానియా వైద్యులు కేవలం 30 రోజుల్లో 5 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా జరిపి మరో రికార్డు సొంతం చేసుకున్నారు. నెలరోజుల కాల వ్యవధిలో ఒకటి కంటే ఎక్కువ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జరిపిన దాఖలాలు దేశంలోని ప్రభుత్వ రంగ దవాఖానల్లో ఎక్కడ లేదని, ప్రభుత్వ రంగ దవాఖానలో తొలిసారిగా 30 రోజుల్లో ఐదు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జరిపిన ఘనత ఉస్మానియాకే దక్కిందని వైద్యాధికారులు చెప్పారు. ఈ మేరకు ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సాహెతో కలిసి సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డా.మధుసూదన్ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెంకు చెందిన జోసోబు, పూజిత వృత్తి రీత్యా దినసరి కూలీలు. వీరిది మేనరిక వివాహం. ఈ దంపతుల మొదటి సంతానం టైరోసినిమియా టైప్ -1 డిసీజ్ కారణంగా 4 నెలల వయస్సులోనే మృతిచెందాడు. వీరి రెండో సంతానమైన అజిత్‌కుమార్(2) సైతం టైరోసినిమియా టైప్ 1 డిసీజ్ తో బాధపడుతున్నాడు. దీని కారణంగా కాలేయ క్యాన్సర్, క్రానిక్ లివర్ డిసీజ్‌కు గురయ్యాడు. దీంతో బాలుడి కాలేయం విఫలమైంది. బాలుడి పరిస్థితి రోజురోజుకు విషమించడంతో తల్లిదండ్రులు నగరంలోని పలు కార్పొరేట్ దవాఖానలకు తిరిగారు. అయితే ఈ సర్జరీకి ప్రైవేట్ హాస్పిటల్‌లో రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చవుతుందని అక్కడి ప్రైవేటు దవాఖాన వారు చెప్పడంతో అంత ఆర్థిక స్థోమత లేని బాధిత కుటుంబం ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డా.మధుసూదన్‌ను సంప్రదించారు. టైరోసినిమియా కారణంగా బాలుడి కాలేయం పూర్తిగా దెబ్బతిన్నదని నిర్ధారించి, వెంటనే కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.30లక్షల నుంచి రూ.40లక్షల ఖరీదైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను పైసా ఖర్చు లేకుండా లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను ఉచితంగా జరిపారు. ఈ సర్జరీలో రోగికి అతడి అమ్మమ్మ కాలేయంలో నుంచి కొంత భాగాన్ని తీసి బాలుడికి మార్పిడి చేసినట్లు డా.మధుసూదన్ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఉస్మానియా వైద్యులు

### జన్యుపరమైన వ్యాధి కారణంగా..

సూర్య పేట జిల్లా, రాణి గూడెం ప్రాంతానికి చెందిన వీరస్వామి, నాగజ్యోతి దంపతుల కుమారుడు సాత్విక్ గౌడ్(7) విల్సన్స్ అనే జన్యుపరమైన వ్యాధి కారణంగా డీ-కంపెన్సేషన్‌తో ఏర్పడే క్రానిక్ లివర్ డిసీజ్‌తో బాధపడుతున్నాడు. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో రాగి అంటే కాపర్ ఉంటుంది. దీనిని కాలేయంలో ఉండే సెరలోప్లాసిస్ అనే పదార్థం కాపర్‌ను గ్రహించి మలం ద్వారా బయటకు పంపిస్తుంది. అయితే విల్సన్ రుగ్మత గల రోగుల్లో సెరలోప్లాసిస్ లోపం వల్ల ఈ కాపర్ అనేది బయటకు పోకుండా కాలేయం, మెదడులో పేరుకుపోతున్నది. ఇది సిర్రోసిస్, వణుకు, వికృతమైన నడక, కళ్లో కేఎఫ్ రింగ్‌లు, హేమోలిటిక్ రక్తహీనతకు కారణమవుతుంది. కాలేయం విఫలమవుతుంది. విల్సన్ రుగ్మత కారణంగా సాత్విక్ కాలేయం విఫలమైంది. బాలుడి కుటుంబ సభ్యులు నగరంలోని పలు ప్రైవేటు దవాఖానలను సంప్రదించగా అక్కడ రూ.30 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో ఆర్థిక స్థోమత లేని కుటుంబ సభ్యులు బాలుడిని ఉస్మానియాకు తీసుకువచ్చారు. వైద్యపరీక్షలు జరిపిన వైద్య బృందం బాలుడికి కాలేయ మార్పిడికి ఏర్పాట్లు చేశారు.ఇందులో భాగంగా రోగి తల్లి నాగజ్యోతి కాలేయం ఎడమ భాగం నుంచి కొంత భాగాన్ని తీసి బాలుడికి లైవ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిపారు. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా, ఎడిగోనపల్లికి చెందిన వెంకటేశ్(20) విల్సన్ రుగ్మత కారణంగా సిరోసిస్‌తో బాధపడుతున్నాడు. హన్మకొండ ప్రాంతానికి చెందిన ఎం.హర్షప్రియ న్యూరో విల్సన్ రుగ్మతతో బాధపడుతున్నది. ఈ రోగులిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఆర్థిక స్థోమత లేక ఉస్మానియాను ఆశ్రయించారు. ఈ మేరకు రోగులకు వైద్యపరీక్షలు జరిపించిన వైద్యులు బ్రెయిన్ డెడ్‌కు గురైన ఇద్దరు వేర్వేరు జీవన్మృతుల కాలేయాలను సేకరించి కడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించారు.

### అరుదైన వ్యాధితో..

యాదాద్రి జిల్లా, బ్రాహ్మణపల్లికి చెందిన ఎం.వెంకటేశ్(40) అరుదైన బడ్ చైరి సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. ఇది ప్రొటీన్-సీ, ప్రొటీన్-ఎస్ లోపం వల్ల వచ్చే జనటిక్ వ్యాధి. దీని కారణంగా ఇతడి కాలేయం విఫలమవ్వడంతో కాలేయ మార్పిడి తప్పనిసరైంది. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్ చికిత్స కోసం ఉస్మానియాను ఆశ్రయించగా వైద్యపరీక్షలు జరిపన వైద్యులు.. రోగికి కడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిపారు. కేవలం 30రోజుల వ్యవధిలో ఈ ఐదుమంది రోగులకు జరిపిన కాలేయ మార్పిడిలన్నీ విజయవంతమయ్యాయని, వీటి ఖరీదు ప్రైవేటు దవాఖానల్లో రూ.1.5కోట్ల వరకు ఉంటుందని వైద్యులు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి ప్రొఫెసర్ మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అరుదైన శస్త్ర చికిత్సల్లో ప్రొఫెసర్లు అభిమన్యు, ఉమాదేవి, రమేశ్‌కుమార్, విజయ్‌శంకర్, వైద్యులు లక్ష్మీనారాయణ, సునీల్, మానస, భావన, కావ్య, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండున్నర గంటలు స్తంభించిన మెట్రో

### సిగ్నల్ వ్యవస్థలో ఇబ్బందుల కారణంగా నిలిచిన సేవలు..ప్రయాణికుల అవస్థలు



అవస్థలు పడుతున్న మెట్రో ప్రయాణికులు

సిటీబ్యూరో: హైదరాబాద్‌లో మెట్రో సేవలు ఒక్కసారిగా స్తంభించాయి. సాంకేతిక కారణాలతో పలు మార్గాల్లో సర్వీసులు ఆగిపోయాయి. ప్రధానంగా నిత్యం రద్దీ ఉండే నాగోల్-హైటెక్ సిటీలో రెండున్నర గంటల పాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం 6.30 గంటల నుంచే తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు నిత్యం మెట్రో మార్గంలో ప్రయాణించేవారంతా అవస్థలుపడ్డారు. బుధవారం ఉదయం నాగోల్ నుంచి రాయదుర్గం మార్గంలో సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్యలు తలెత్తాయి. ఉదయాన్నే ఒక్కసారిగా ఐటీ కారిడార్ ఉద్యోగులతో నిండిపోయే నాగోల్ మార్గంలోని పలు స్టేషన్లు అన్నీ రద్దీగా మారిపోయాయి. గంటల తరబడి రాకపోకలు నిలిచిపోవడం, పునరుద్ధరణకు గంటల కొద్దీ సమయం పట్టింది. దీంతో ఆఫీసులకు వెళ్లేందుకు కేవలం మెట్రోనూ ఆశ్రయించేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

### ఇతర మార్గాల్లో రాకపోకలు

రోజు వెళ్లే మార్గం ఒక్కసారిగా మూసుకుపోవడంతో జనాలకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా నాగోల్ నుంచి రాయ్‌దుర్గం వరకు వెళ్లేవారు, అదేవిధంగా అమీర్‌పేట నుంచి ఐటీ కారిడార్‌లో ప్రయాణించేవారు ఇరుక్కుపోయామనే భావనతో తీవ్ర అసహనానికి గురయ్యారు. దీనికి ప్రధాన కారణం ఉదయం నుంచే సిగ్నలింగ్ వ్యవస్థలో టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయి. కానీ ఎల్ అండ్ టీ వాటిపై దృష్టి పెట్టలేదు. సోషల్ మీడియాలో ప్రయాణికులు స్పందించడంతో పునరుద్ధరణకు చర్యలు తీసుకుని పనులు మొదలుపెట్టారు. ఎలాంటి ప్రకటన లేకుండా రెండున్నర గంటల పాటు మెట్రో రాకపోకల్లో అంతరాయం ఏర్పడటంతో... ఇతర మార్గాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. ముఖ్యంగా నాగోల్, అమీర్‌పేట వద్ద ఇతర మార్గాల్లో వెళ్లిపోయారు.




## ఎవరి వ్యూహాలు వారివే..!

**ఎన్నికల ఏడాది కావడంతో హాట్ హాట్‌గా కౌన్సిల్**

**నేడు జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశం**

సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశానికి సర్వం సిద్ధమైంది. ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన కౌన్సిల్ దాదాపు ఆరు నెలల తర్వాత జరుగుతున్నది. అసలే ఎన్నికల ఏడాది కావడం...గడిచిన ఏడాది కాలంగా అభివృద్ధి పనులు కుంటుపడడం..రోజూరోజుకు ప్రజా సమస్యలు పెరిగిపోతున్న దరిమిలా అన్ని పార్టీల సభ్యులు ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీలు కౌన్సిల్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయ వేడి అలుముకున్నది. మొత్తంగా గతంలో కంటే సమావేశం వాడీ వేడీగా జరిగే అవకాశం ఉంది.

### కౌన్సిల్‌లో బలంగా బీఆర్‌ఎస్..

కౌన్సిల్‌లో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులు అధికార పార్టీ లోపాలను ఎత్తి చూపేందుకు సిద్ధమయ్యారు. ఏడాది కాలంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పురోగతిలో ఉన్న ఎస్‌ఆర్‌డీపీ, ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి చేయలేదు. ముఖ్యంగా ఏడాది కాలంగా కొత్త ప్రాజెక్టులు లేకపోవడం, వీధి లైట్ల నిర్వహణ లోపాలు, బడ్జెట్ కేటాయింపుల ప్రధాన అస్త్రాలుగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఎండగట్టనున్నారు. ఇటీవల గ్రేటర్ బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులంతా కమిషనర్ ఇలంబర్తిని కలిసి నియోజకవర్గాల వారీగా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఇదే క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచిన కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిపై తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు. కాగా, అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో సమావేశమయ్యారు. అటెన్షన్ డైవర్షన్ విధానాన్నే అవలంబించాలని వారికి చెప్పినట్లు తెలుస్తున్నది. కాగా, మేయర్ మాత్రం ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను ఆమోదింపజేయడమే లక్ష్యంగా సభ నిర్వహణ జరిపే ఆస్కారం ఉందన్న చర్చ ఉంది.

### సభ సజావుగా సాగేనా?

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 10.30 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభం కానున్నది. తొలుత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం ప్రకటించనున్నారు. ఆ తర్వాత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత మేయర్ బడ్జెట్ ప్రసంగం ఐదు నిమిషాల పాటు ఉండనున్నది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి చర్చ పెట్టనున్నారు. అయితే బడ్జెట్ ప్రసంగంపై చర్చ ఏ మేర జరుగుతుంది? బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ సభ్యుల మధ్య మాటల తూటాలు పేలే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే కౌన్సిల్ సందర్భంగా వివిధ పార్టీల సభ్యుల నుంచి 125 ప్రశ్నలు రాగా..అందులో 19 ప్రశ్నలను మాత్రమే ఎంపిక చేశారు.